

రేపు మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు సమావేశం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 26: మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు నారాయణఖేడ్ ఆర్డీవో వెంకటేశ్ పేర్కొన్నారు. అవిశ్వాస తీర్మానంపై కాంగ్రెస్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్లతో పాటు బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు, ఎక్స్‌అఫీషియో సభ్యులైన ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కలిసి మొత్తం 13 మంది హాజరయ్యారు. దీంతో చైరపర్సన్, వైస్ చైర్మన్ పదవులు కోల్పోయారు. బుధవారం ఎన్నిక కోసం సమావేశం నిర్వహించనున్నారు.



చేను కాదు.. ఇది చెరువే!

ఈ ఫొటోలో కనిపిస్తున్నది పచ్చగా పెరిగిన పంట అనుకుంటే పొరబడినట్టే.. ఇది జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువు. మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసిన ఈ చెరువులో ఎనభై శాతం గుర్రపుడెక్క నిండిపోవడంతో ఇలా దర్శనమిస్తున్నది. గుర్రపుడెక్క కారణంగా జాలర్లు చేపలు పట్టలేకపోతున్నారు. అట్టహాసంగా ప్రారంభించిన బోటింగ్ మూత పడింది. పొరపాటున మనుషులో, పశువులో దిగితే ప్రమాదమే!

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 26





ఇంటర్ ప్రశ్నాపత్రాలను మూల్యాంకనం చేసే సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

ఇక.. సంగారెడ్డిలోనే ఇంటర్ మూల్యాంకన కేంద్రం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 26 : జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు నిర్ణయించింది. ఇందుకు సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వేదిక కానుంది. ఈ ఏడాది నుంచి ఇంటర్ ప్రశ్నాపత్రాల మూల్యాంకనాన్ని ఇక్కడి నుంచే నిర్వహించనున్నారు. ఇంతకుముందు ఆర్సీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూల్యాంకన కేంద్రం నిర్వహిస్తుండగా ఆ కేంద్రాన్ని సంగారెడ్డికి మార్చుతూ ఇంటర్ బోర్డు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మార్చి 16న ఇంటర్ పరీక్షలు పూర్తికానుండగా మరుసటి రోజు నుంచి ప్రశ్నాపత్రాల మూల్యాంకనం ఇక్కడే జరుగుతుందని ఇంటర్మీడియట్ అధికారులు తెలిపారు.

ఏడుపాయల హుండీ ఆదాయం రూ.49,06,854

పాపన్నపేట, ఫిబ్రవరి 26 : ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయశాఖ సహాయక కమిషనర్ శివరాజ్, ఇన్‌స్పెక్టర్ రంగారావు సమక్షంలో సోమవారం ఆలయం సమీపంలో ఉన్న గోకుల్‌షెడ్‌లో నిర్వహించారు. 71 రోజుల హుండీని లెక్కించగా రూ.49,06,854 ఆదాయం సమకూరినట్టు అధికారులు వెల్లడించారు. బంగారం, వెండి ఆభరణాలను తిరిగి హుండీలోనే వేశారు. కామారెడ్డికి చెందిన రాజరాజేశ్వర, సత్యసాయి సేవాసమితి సభ్యులు, ఆలయ సిబ్బంది హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి పి.మోహన్‌రెడ్డి, పాలకమండలి చైర్మన్ సాతెల్లి బాలాగౌడ్, డైరెక్టర్లు పర్యవేక్షించారు. ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది భద్రతను కల్పించారు.

అమృత్ భారత్‌తో మహర్దశ

రూ.15.31 కోట్లతో మెదక్ స్టేషన్ అభివృద్ధి

- పనులను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ
- కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు : ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి
- జిల్లా ప్రజలకు ప్రయోజనకరం : కలెక్టర్ రాజర్షిషా



మెదక్‌లో అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షిషా, డీఈ శ్రీతేజ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 26: రైల్వేస్టేషన్లను ఆధునికంగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా మెదక్ స్టేషన్‌ను అభివృద్ధి చేసే పనులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారు. వర్చువల్ పద్ధతిలో సోమవారం ఆయన మెదక్ రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ స్టేషన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మెదక్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షిషా హాజరయ్యారు. ప్రధాని మోదీ ప్రసంగాన్ని తిలకించేందుకు భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఆట్టహాసంగా జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ప్రధాని వర్చువల్‌గా ప్రసంగిస్తూ సామాన్యులు ఎక్కువగా ఉపయోగించే రైల్వేలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైల్వే రంగంలో వస్తున్న మార్పులను మీ కళ్లతో చూస్తున్నారన్నారని, వందే భారత్ వంటి రైళ్ల గురించి గతంలో ఏ ప్రభుత్వాలు ఆలోచించలేదని పేర్కొన్నారు. అనంతరం మెదక్ స్టేషన్‌లో ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ మెదక్‌ను అమృత్ భారత్ స్టేషన్‌గా ఎంపిక చేసి రూ.15.31 కోట్లు నిధులు మంజూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు. మెదక్‌కు రైలు మార్గం వేయడం ద్వారా ఈ చుట్టుపక్క ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో మనోహరాబాద్ జంక్షన్‌గా ఏర్పడే అవకాశం ఉన్నందున మెదక్ లైన్ కలుపడంతో ఇంకా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇప్పటికే సర్వే పూర్తయిన మెదక్ నుంచి పటాన్‌చెరు వయా (వట్టినాగులపల్లి) జోగిపేట-సంగారెడ్డి రైల్వేలైన్ పనులు త్వరగా ప్రారంభించాలని కోరారు.

ఉపాధి అవకాశాలు పెరుగుతాయి

మెదక్ రైల్వే స్టేషన్‌కు నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలు ఆధునికీకరించడం ద్వారా జిల్లా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మెదక్ కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. రైల్వేస్టేషన్ అభివృద్ధితో జిల్లాలో వ్యవసాయం, పారిశ్రామిక రంగం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. మహిళలకు, విద్యార్థులకు, ఉద్యోగులతోపాటు సుదూర ప్రాంతాలకు ప్రయాణించే వారికి లబ్ధిచేకూరుతుందని తెలిపారు. అంతకు ముందు విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వికసిత్ భారత్ కార్యక్రమంలో వివిధ పోటీల్లో పాల్గొన్న గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను ఎమ్మెల్సీ, కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రైల్వే సీనియర్ డీఈ శ్రీతేజ, అధికారులు రాజు, నర్సింహ, వినయ్, రహమాన్, స్టేషన్ సూపరింటెండెంట్ రమేష్, స్టేషన్‌మాస్టర్ పద్మారావు, నవనీత్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వర్చువల్‌గా ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

ఆర్వోబీ పనులకు శంకుస్థాపన

మాసాయిపేట/రామచంద్రాపురం, ఫిబ్రవరి 26 : దేశవ్యాప్తంగా రైల్వే పనులకు సోమవారం ప్రధానమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా మాసాయిపేట మండలం రామంతపూర్ రైల్వేగేటు వద్ద, సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఈదులనాగులపల్లి రైల్వేస్టేషన్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. రామంతపూర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రణీత వేణుగోపాల్‌రెడ్డి, రైల్వే ఇంజనీరింగ్ అధికారులు హాజరయ్యారు. ఈదులనాగులపల్లి వద్ద కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్ శంషాబాద్‌రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి దక్షిణమధ్య రైల్వే నోడల్ అధికారి రామాంజనేయరావు, స్టేషన్ మేనేజర్ బుచ్చిరెడ్డి, బీడీఎల్ భానూర్ సీఐ రవీందర్‌రెడ్డి, సెక్షన్ ఇంజనీర్ మల్లేష్, సెక్షన్ కమిటీ సభ్యుడు సురేందర్‌నాథ్, టెలికం కమిటీ సభ్యుడు దొర, నాగులపల్లి స్టేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బల్దియాకు నిధుల కటకట

- ఆదాయ వ్యయాలు సరిసమానం
- నేడు మెదక్ మున్సిపల్ బడ్జెట్ సమావేశం

మెదక్, ఫిబ్రవరి 26: మెదక్ మున్సిపాలిటీ నిధుల లేమితో అల్లాడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుంచి నిధులు నిలిచిపోయాయి. పట్టణ ప్రగతి, మ్యాచింగ్ గ్రాంట్లు, 15 వ ఆర్థిక సంఘం నిధులు విడుదలకాకపోవడంతో అభివృద్ది పనులు ఆగిపోయాయి. ప్రభుత్వ కార్యాలయ భవనాలకు సంబంధించి ఆస్తి పన్ను బకాయిలు కోట్లాది రూపాయలు పేరుకుపోవడంతో జనరల్ ఫండ్ నిధులు కూడా జమకావడంలేదు. కేవలం ప్రజలు చెల్లించే ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్ ఇతర పన్నుల ద్వారా సమకూరే ఆదాయాన్నే నిర్వహణకు వాడుకుంటున్నారు. ఆదాయాన్ని పెంచుకునేందుకు మార్గాలు ఉన్నా వాటిపై పాలకవర్గం, అధికారులు దృష్టి కేంద్రీకరించడంలేదు. మెదక్ జిల్లా కేంద్రంగా మారాక ఇళ్లనిర్మాణాలు, వివిధ మండలాలు, గ్రామాల నుంచి వచ్చే వారి సంఖ్య పెరిగింది. చుట్టు ప్రక్కల గ్రామాలు మున్సిపాలిటీలో విలీనం కావడం వల్ల పట్టణం విస్తరిస్తోంది. మెదక్ పట్టణ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించకపోతే వివిధ అభివృద్ధి పనులు అర్థాంతరంగా నిలిచిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.



మెదక్ మున్సిపల్ కార్యాలయం

పట్టణ ప్రగతికి నిధుల గండం

గత ప్రభుత్వం 2020లో పట్టణ ప్రజల మౌళిక సమస్యల పరిష్కారం కోసం పట్టణ ప్రగతి పథకాన్ని ప్రవేశ పెట్టింది. అందులో భాగంగా మెదక్ మున్సిపాలిటీకి ప్రతీ నెలా రూ.17 లక్షలు మంజూరు అయ్యేవి. ఆ నిధులతో పాటు 15వ ఆర్థిక సంఘ నిధులతో మురికి కాల్వల నిర్మాణం, సిమెంటు రోడ్లు, పట్టణ సుందరీకరణ పనులు చేపట్టేవారు. అయితే, 2023 ఏప్రిల్ మాసం నుంచి పట్టణ ప్రగతి నిధులు విడుదల చేయలేదు. ఐనప్పటికీ ప్రభుత్వం నుంచి ప్రొసీడింగ్స్ వస్తాయనే నమ్మకంతో ఇంజనీరింగ్ విభాగం అధికారులు మున్సిపల్ పాలకవర్గ తీర్మాణంతో వివిధ అభివృద్ది పనుల నిర్మాణాలకు అంచనాలను తయారు చేశారు. అనంతరం డీఎల్‌సీ(డిస్ట్రిక్ లెవల్ కమిటీ) ఆమోదంతో టెండర్లను ఆహ్వానించారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టరు పనులూ పూర్తిచేశారు. ప్రభుత్వం నుంచి గత 10 నెలలుగా ఫండ్ విడుదల కాకపోవడంతో సుమారు రూ.2 కోట్ల చెల్లింపులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో నిధులు మంజూరు అవుతాయనే ఆశతో గుత్తేదార్లు ఎదురు చూస్తున్నారు. ఇక గత ప్రభుత్వ హయాంలో టీయూఎఫ్ఐడీసీ(బ్యాంకుల నుంచి రుణ రూపేణా పొందే) నిధులు ముంజూరు ఐనప్పటికీ అప్పటికే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో టెండర్లు నిలిచిపోయాయి. సమీకృత మార్కెట్ భవన నిర్మాణం, రాందాస్ చౌరస్తాలో నిర్మాణం జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ గ్రౌండ్ లెవల్‌కే పరిమితమయ్యాయి.

రూ.35 కోట్ల టీయూఫ్ఐడీసీ నిధులు

మున్సిపాలిటీ 2024-25 సంవత్సరానికి సంబంధించి రూ. 50.9 కోట్లతో రూపొందించిన బడ్జెట్ ఆమోద ముద్రకు మంగళవారం కౌన్సిల్ సమావేశం కానుంది. మొత్తం బడ్జెట్‌లో ఆస్తి పన్ను, టౌన్ ప్లానింగ్, లైబజార్, షాపింగ్ కాంప్లెక్స్ అద్దెలు, ప్రకటనలు, నాన్ ప్లాన్, ఇతర గ్రాంట్లతో పాటు టీయూఎఫ్ఐడీసీ ఫండ్స్ ద్వారా రూ.50.9 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. వ్యయం కూడా రూ50.89 కోట్లు చూపడం ద్వారా ఆదాయ వ్యయాలు సరిసమంగా ఉన్న బడ్జెట్‌గా రూపొందించారు. జీతాలు, పారిశుద్య నిర్వహణ, కరెంటు చార్జీలూ, వివిధ సంస్థల నుండి పొందిన రుణాల చెల్లింపులు, గ్రీన్ బడ్జెట్, డిపాజిట్లు, అడ్వాన్సులు చెల్లింపులను వ్యయంలో చూపారు. గత సంవత్సరం మిగులు బడ్జెట్ రూ 2 లక్షలు చూపారు.



సంగారెడ్డిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

ఎంపీ సీట్లు బీసీలకు కేటాయించాలి

- పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి
- రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 26 : జనాభా ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలు ఎంపీ సీట్లను బీసీలకు కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 75 సంవత్సరాలుగా బీసీలు అణిచివేతకు గురయ్యారన్నారు. రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగానే వినియోగించుకున్నారే కానీ ఎదగనీయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. బీసీలకు రాజకీయంలో వాటా ఇవ్వాలని, ఉద్యోగాల్లో, పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏమాత్రం సరిపోదని, బడ్జెట్‌ను మరింత పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయా విద్యాసంస్థల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో బీసీ ఉద్యమానికి పార్టీలకతీతంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుగౌడ్ మాట్లాడుతూ బీసీల సమస్యలపై ఆర్.కృష్ణయ్య సుదీర్ఘకాలంగా పోరాటాలు చేసినందుకే ప్రస్తుతం బీసీలను రాజకీయ పార్టీలు గుర్తిస్తున్నాయన్నారు. కృష్ణయ్య అడుగుజాడల్లో ప్రతి బీసీ బిడ్డ నడిచి ఉద్యమానికి సంఘీభావం తెలపాల్సిన అవస్యకత ఉన్నదని చెప్పారు. ఈ సమావేశంలో మద్దికొండ కొండయ్య, కృష్ణయ్య, సంగమేశ్వర్, వెంకటేశం, మక్సుద్,య శేఖర్, అనంతయ్య, రాజేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

- మెదక్ జిల్లాలో 67,972 మంది చిన్నారులు
- చుక్కల మందు వేసేందుకు 523 బూత్‌లు
- మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 26: సమన్వయంతో పనిచేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులకు పిలుపునిచ్చారు. పల్స్ పోలియోపై జిల్లా టాస్క్‌ఫోర్స్ సమన్వయ కమిటీ సమావేశాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3 నుంచి మూడు రోజులు పల్స్ పోలియో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పుట్టిన చిన్నారుల నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా చుక్కలు వేయించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో 67,972 మంది చిన్నారులకు చుక్కలమందు వేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 523 బూత్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌వో చందునాయక్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు 68 సెంటర్లు

పదో తగరతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లాలో 68 సెంటర్లను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 18 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 10,300 మంది విద్యార్థులు టెన్త్ పబ్లిక్ ఎగ్జామ్స్‌కు హాజరు కానున్నట్లు ఆయన వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాజర్షిషా

ఇండస్ట్రియల్ పార్కుకు భూములివ్వండి

- గుండ్రెడ్డిపల్లిలో రైతులతో అధికారుల చర్చలు

తూప్రాన్, ఫిబ్రవరి 26: తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గుండ్రెడ్డిపల్లి, గౌడిగూడెం గ్రామాల మధ్యలో ఉన్న ప్రభుత్వ అసైన్డ్ భూమి సేకరించేందుకు నిర్ణయించారు. గుండ్రెడ్డిపల్లిలో సర్వేనంబరు 437లో 45.08 ఎకరాలు, సర్వే నంబరు 440లో 2.18 ఎకరాలుగా 47.26 ఎకరాల భూసేకరణ చేసేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సర్వేయర్ బాలు గుండ్రెడ్డిపల్లి గ్రామ రైతులతో సమావేశమయ్యారు. రైతులతో ధర విషయంలో చర్చలు జరిపారు. ఎకరాకు రూ.17 లక్షలు చెల్లించేందుకు అధికారులు నిర్ణయించగా, రైతులు రూ.25లక్షలు చెల్లించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఉమ్మన్నగారి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



రామంతాపూర్‌లో భూములను పరిశీలిస్తున్న అధికారులు

ఫార్మా విలేజ్ కోసం భూముల పరిశీలన

మాసాయిపేట, ఫిబ్రవరి 26: సీలింగ్, అసైన్డ్ భూముల్లో ఫార్మా విలేజ్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో సోమవారం మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పొల్యూషన్, రెవెన్యూ అధికారులు మాసాయిపేట మండలంలోని రామంతాపూర్‌లో 342.12 ఎకరాలు, అచ్చంపేటలో 430.25 ఎకరాలు, హకీంపేటలో 162.14 ఎకరాలు... మొత్తం 912.1 ఎకరాల సీలింగ్, అసైన్డ్ భూములను పరిశీలించారు. అలాగే అచ్చంపేటలోని హల్దీవాగు పరీవాహక ప్రాంతంలో సాగవుతున్న భూములను పరిశీలించిన అధికారులకు ప్రజల నుంచి కొంత వ్యతిరేకత వచ్చింది. మాసాయిపేట ఎంపీటీసీ కృష్ణారెడ్డి, రామంతాపూర్, అచ్చంపేట, హకీంపేట గ్రామాల నాయకులు తమ ప్రాంతంలో ఫార్మా విలేజ్ అవసరం లేదని విజ్ఞప్తి చేశారు. కేవలం తాము భూములను పరిశీలించడానికి వచ్చామని, పై అధికారులకు, ప్రభుత్వానికి నివేదికలు అందజేస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట మాసాయిపేట ఎమ్మార్వో జ్ఞానజ్యోతి, ఆర్ఐ ధన్‌సింగ్, సర్పంచులు పాల్గొన్నారు.

చేగుంట మండలంలో

చేగుంట, ఫిబ్రవరి 26: చేగుంట మండలం బోనాల కొండాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 68, 242, 629లో గల 1060 ఎకరాల 13 గుంటల ప్రభుత్వ భూములను మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం పరిశీలించారు. ఆయన వెంట తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, తహసీల్దార్ గియాఉన్నీసా బేగం, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, సర్వేయార్ రవీందర్‌రెడ్డి, భూగర్భ వనరులు, కాలుష్య నియంత్రణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తాం

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 26: మెదక్ జిల్లాలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి.. అవసరాలకు వినియోగిస్తామని మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం చిన్నశంకరంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మొబైల్ రికార్డులను పరిశీలించి, తహసీల్దార్ మన్నన్‌తో సమీక్షించారు. అనంతరం సూరారం గ్రామ శివారులో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- ఈనెల 28 నుంచి మార్చి 16 వరకు నిర్వహణ
- మెదక్ జిల్లాలో 30, సంగారెడ్డి జిల్లాలో 52, సిద్దిపేట జిల్లాలో 44 కేంద్రాల ఏర్పాటు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 26: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను ఈనెల 28 నుంచి మార్చి 6వ తేదీవరకు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయి. నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించరు. ఉదయం 8 గంటల వరకు పరీక్షా కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాల్సి ఉంటుంది. సీసీ కెమెరాల నిఘాలో ప్రశ్నాపత్రాల కవర్లను తెరుస్తారు. సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ సంతకం లేకపోయినా హాల్ టికెట్‌ను సంబంధింత వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరుకావచ్చు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

మెదక్ జిల్లాలో 30 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 13,172 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ప్రశ్నాపత్రాల స్టోరేజీకి 14 పాయింట్లు ఏర్పాటు చేశారు. 30 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 30 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందం, 4 సిట్టింగ్ స్క్వాడ్స్, 5 కస్టోడియన్ బృందాలు, 600 మంది ఇన్విజిలేటర్స్‌ను నియమించారు.

ప్రత్యేక కంట్రోల్ రూం

విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు ఈ నంబర్లు పనిచేస్తాయి. సమస్య ఉన్న విద్యార్థులు 7671033323 లేదా 9603615652 నంబర్లను సంప్రదించాలన్నారు. ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేశామని ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ అన్నారు.

గంట ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 26: విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యంగా వచ్చినా ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి(డీఐఈవో) ఆర్.గోవిందరామ్ స్పష్టం చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంటర్ పరీక్షల నిమిత్తం జిల్లాలోని 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రథమ సంవత్సరం జనరల్ 15,984 మంది, వొకేషనల్ 1,681, మొత్తం-17,665 మంది, అలాగే ద్వితీయ సంవత్సరం జనరల్ 17,057, వొకేషనల్ 1,431, మొత్తం-18,488 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వివరించారు. పరీక్షల పర్యవేక్షణ కోసం 52 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 52 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, డీఈసీ మెంబర్లు, హైపవర్ కమిటీ, ఫ్లైయింగ్ స్క్వార్డ్, సిట్టింగ్ స్క్వార్డ్, 925 ఇన్విజిలేటర్లను నియమించామ ని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి(డీఐఈవో) ఆర్.గోవిందరామ్ తెలిపారు.



సిద్దిపేటలోని బాలుర జూనియర్ కళాశాలలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న అధికారులు

ఏర్పాట్లు పూర్తి

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 26: రేపటి నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి సూర్యప్రకాష్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సర 9,831 మంది, రెండో సంవత్సర 11,118 మంది, మొత్తం 20,949 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షల నిమిత్తం సిద్దిపేట జిల్లాలో మొత్తం 44 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, హై పవర్ టీమ్, డిస్ట్రిక్ ఎగ్జామినేషన్‌తో కలిపి మొత్తం మూడు కమిటీలను ఏర్పాటు చేసింది.

రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించిన గజ్వేల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

గజ్వేల్‌టౌన్/గజ్వేల్, ఫిబ్రవరి 26: గజ్వేల్ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటనలో భాగంగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవ సంబరాలు సందర్భంగా 26 నుంచి 28 తేదీ వరకు విద్యార్థులకు రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించే అవకాశాన్ని కల్పించినందున కళాశాల నుంచి దాదాపు 55 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్విజ్ పోటీలు, పుస్తక ప్రదర్శన, సైన్స్ ప్రదర్శనలో విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు.

'ప్రజావాణి' సమస్యలను పరిష్కరించండి



సంగారెడ్డి రూరల్: సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్/పటాన్‌చెరు, ఫిబ్రవరి 26: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. నారాయణఖేడ్‌కు చెందిన జనార్ధన్‌రెడ్డి తమకు సంబంధించిన వారసత్వ భూమిని సర్వే చేసేందుకు చలానా కట్టి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసినా సర్వే చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి పట్టణానికి చెందిన రుబీనా తనకు పింఛన్ ఇప్పించాలని అర్జీ పెట్టుకున్నారు. వీటితో పాటు రెవెన్యూ శాఖకు సంబంధించి 20 అర్జీలు, వివిధ శాఖలకు సంబంధించి 50 దరఖాస్తులు రాగా మొత్తం 70 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. అమీన్‌పూర్ పెద్ద చెరువు నీటిని ఏళ్ల తరబడి వదలకుండా స్టోర్ చేయడంతో తమ ప్లాట్లు మునిగిపోయాయని ఎఫ్‌టీఎల్‌కు ఎగువభాగంలో ఉన్న లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు వాపోయారు. ఈ విషయమై ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

'ప్రజావాణి'కి భూసమస్యల వెల్లువ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 26: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 81 అర్జీలు వచ్చాయి. దరఖాస్తులు ఇస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ కలెక్టర్ రాజర్షిషా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రధానంగా ధరణి భూ సమస్యలు 32, ఉపాధి, విద్య వైద్యం 5, పెన్షన్లు 4, ఇతర సమస్యలపై 40 వినతులు అందాయి.

సత్వరమే పరిష్కరించాలి: ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 26: పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ డా. బాలస్వామి సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణిలో భాగంగా ప్రజలను దరఖాస్తులను స్వీరించారు. గంజాయి సేవించి యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్పీ సూచించారు. మత్తు పదార్థాల నియంత్రణ, నివారణపై తీసుకోవాల్సిన అంశాలపై ఎస్పీ మాట్లాడారు.

అర్జీదారుల వినతులను పరిష్కరించాలి: డీఆర్‌వో

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 26: ప్రజావాణిలో వచ్చిన అర్జీదారుల వినతులను వెంటనే పరిష్కరించాలని డీఆర్‌వో నాగరాజమ్మ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ఆమె 45 దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

● వైద్యాధికారి అనిల్‌కుమార్

చేగుంట, ఫిబ్రవరి 26: చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పల్స్‌పోలియో కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి అనిల్‌కుమార్ మాట్లాడారు. మార్చి 3వ తేదీన పల్స్‌పోలియో సందర్భంగా మండలంలోని ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాల బిడ్డకు, ప్రతీ ఒక్కరికి రెండు చుక్కల పోలియో మందు వేయాలన్నారు. అన్ని గ్రామాల్లోని ప్రధాన కూడళ్లతో పాటు బస్టాండు, రైల్వేస్టేషన్‌లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కల కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో చాటింపు వేయించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మాసుల శ్రీనివాస్, ఎంపీడీవో చిన్నారెడ్డి, వైద్య సిబ్బంది, వివిధ గ్రామాల ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రేపు అక్షయపాత్రలో 'నౌరిష్ ద చేంజ్'

కంది, ఫిబ్రవరి 26: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావడానికి కందిలో అక్షయపాత్ర ఫౌండేషన్ కేంద్రంలో ఈ నెల 28న నౌరిష్ ద చేంజ్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ ప్రాంతీయ అధ్యక్షుడు సత్య గురు చంద్రదాస సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, అక్షయపాత్ర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మధు పండిత దాసలు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు తెలిపారు.

పలు ప్రాంతాల్లో రైల్వే అండర్ బ్రిడ్జి పనులకు శ్రీకారం

ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా రైల్వేలకు సంబంధించి పలు అభివృద్ధి పనులను వర్చువల్ విధానం ద్వారా సోమవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలను రైల్వే అధికారులు స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ప్రారంభించారు.



కోహీర్ మండలం రాజనెల్లి వద్ద, మనోహరాబాద్ మండలంలోని కూచారంలో రైల్వే అండర్‌పాస్ వంతెన పనుల శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న రైల్వే అధికారులు, బీజేపీ నాయకులు

కోహీర్ ఫిబ్రవరి 26: మండల పరిధిలోని రాజనెల్లి-పీచేర్యాగడి గ్రామాల మధ్య ఉన్న రైల్వేలైన్ వద్ద రూ.2.24 కోట్లతో నిర్మించిన రైల్వే అండర్‌పాస్ వంతెనను సోమవారం రైల్వే అధికారులు, మండల బీజేపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు దేశ ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ విధానం ద్వారా అండర్‌పాస్ విధానం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ లింగాల భిక్షపతి మాట్లాడుతూ రైల్వే గేట్ల వద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు కేంద్ర రైల్వే శాఖ రైల్వే అండర్‌పాస్ వంతెన నిర్మిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా స్ర్కీన్‌పై ప్రధాని మోదీ సందేశాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్షన్ టెక్నికల్ ఇంజనీర్ రాజబాబు, సంగమేశ్వర్, చిన్నారి సంతోష్, లింగానంద్, శ్రీనివాస్, వేజా, అశోక్, లక్ష్మణ్, సునీల్, అజీమ్, రాజేష్ బీజేపీ మండల అధ్యక్షుడు వైద్యనాథ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మనోహరాబాద్ మండలంలో..

మనోహరాబాద్, ఫిబ్రవరి 26: మండలంలో 3 రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి పనులను రైల్వే అధికారులు ప్రారంభించారు. మండలంలోని పాలాట, కూచారం గ్రామంలోని దీల్లాయి తండా, శివారులోని గల 3 అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి పనులకు శ్రీకారం చుట్టారు. చాలా చోట్ల రైల్వే గేట్లు వేయడం వల్ల ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, వందే భారత్ నిర్మాణంలో భాగంగా రైల్వే వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్టు అధికారులు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద స్ర్కీన్‌లపై మోదీ సందేశాన్ని ప్రదర్శించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు డాన్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబరిచారు. విజేతలకు రైల్వేశాఖ అధికారులు నగదు బహుమతులను అందజేశారు. కాగా కూచారం గ్రామస్థులు రైల్వే స్టేషన్‌లో ఎంఎంటీఎస్ రైళ్లు నిలపాలని రైల్వే శాఖ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్‌చారీ, మాజీ రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్, రైల్వే సిబ్బంది, రైల్వే పోలీసులు, కార్యదర్శులు, బీజేపీ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా

సంగారెడ్డి రూరల్: విధుల నుంచి తొలగించిన తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ అక్రమంగా తొలగించిన మున్సిపల్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌వో పద్మజారాణికి వినతి పత్రం అందజేశారు.

మూతపడిన స్కూళ్లను ప్రారంభించండి

మునిపల్లి, ఫిబ్రవరి 26: మండలంలోని మూతపడిన మన్సన్‌పల్లి ప్రైమరీ స్కూల్, ఖమ్మంపల్లి ప్రాథమిక పాఠశాల (ఉర్దూ మీడియం)లు పాఠశాలలను ప్రారంభించాలని సంగారెడ్డి జిల్లా తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్‌యాదవ్, అంబేద్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ కలెక్టర్ వల్లూరి క్రాంతికి వినతిపత్రం అందజేశారు.

గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

జిన్నారం, ఫిబ్రవరి 26: పార్లమెంటు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. బీజేపీ జిన్నారం మండల నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షురాలిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో మూడోసారి మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కానున్నదని తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు జగన్‌రెడ్డి పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో ఆర్యవైశ్యుల నిరసన

నారాయణఖేడ్, ఫిబ్రవరి 26: సిద్దిపేట జిల్లా బక్రిచెప్యాల్ గ్రామంలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ ఖేడ్‌లో ఆర్యవైశ్యులు సోమవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలో బైక్ ర్యాలీ తీశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడం తోపాటు ఇకముందు ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని కోరుతూ సీఐ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఆట వస్తువుల బహూకరణ

శివ్వంపేట, ఫిబ్రవరి 26: శివ్వంపేట మండలం ఉసిరికపల్లి ప్రాథమిక పాఠశాలకు వివేకానంద సొసైటీ గజ్వేల్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం సొసైటీ అధ్యక్షుడు మన్నెసుధాకర్, ప్రతినిధులు ప్రకాష్, మహేష్, నరేందర్, గణేష్ ఆట వస్తువులను బహూకరించారు.

సెయింట్ ఆంథోనిస్‌లో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 26: సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనిస్ హైస్కూల్‌లో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్-2 కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పాఠశాలలోని 5, 6వ తరగతికి చెందిన ఐబీటీ, జనరల్ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యాసంస్థల అధినేత ఈ.సలోమోన్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు.

లక్ష్మణ్ త్యాగాలను మరువలేం

జహీరాబాద్, ఫిబ్రవరి 26: తెలంగాణ సాధన కోసం ఆత్మ బలిదానం చేసుకున్న అమరుడు సిరిసిగ లక్ష్మణ్ 14వ వర్ధంతిని సోమవారం జహీరాబాద్‌లో, హోతి(బి) గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా మండలంలోని హోతి(బి) గ్రామంలో ఆయన స్తూపం, సమాధి వద్ద నివాళులర్పించారు.

పురుగుమందు స్ప్రే చేస్తే వాడిపోయిన వరి



వరికి పిచికారి చేసిన మందులను చూపిస్తున్న రైతు

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 26: వరి పంటకు తెగులు సోకిందని క్రిమిసంహారక మందులను పిచికారి చేసిన అన్నదాతకు అకాల కష్టం ఎదురైంది. సూరారం గ్రామానికి చెందిన రైతు చిన్నకంతుల శ్రీశైలం చందాపూర్ గ్రామ శివారులోని నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వరిపంటను సాగు చేస్తున్నాడు. వరిపంట పచ్చగా ఉన్నప్పటికీ మొగి పురుగు సోకింది. వ్యాధి నివారణ కోసం మూడు రోజుల క్రితం శ్రీశైలం చిన్నశంకరంపేట శ్రీసాయిబాలాజీ ఫర్టిలైజర్, సీడ్స్ పెస్టిసైడ్ దుకాణంలో పురుగుమందును కొనుగోలు చేశారు. వరి పంటకు మందును పిచికారి చేయడంతో పచ్చని పంట ఎర్రగా మారి వాడిపోతున్నది. అయోమయానికి గురైన బాధితుడు సదరు ఫర్టిలైజర్ దుకాణ డీలర్ వెంకటేష్ వద్దకు వెళ్లి సమాచారమిచ్చినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. దీంతో ఆగ్రహం చెందిన రైతు సోమవారం ఏవో ప్రవీణ్‌కు సమాచారం అందించగా అతడు రైతు పొలాన్ని సందర్శించి వరి పంటను పరిశీలించాడు. ఈ సందర్భంగా బాధిత రైతు మాట్లాడుతూ అప్పులు తెచ్చి వరి పంటను సాగు చేశాని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపరిహారం ఇప్పించాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏవో మాట్లాడుతూ శాస్త్రవేత్త సలహాల మేరకు నివారణ మందులు స్ప్రే చేయమని సూచించినట్టు తెలిపారు. శాస్త్రవేత్తల సూచనల మేరకు దుకాణ డీలర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

రూ.కోటి విలువైన సీసీరోడ్లకు శంకుస్థాపన



రామాయంపేట దామరచెర్వులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

రామాయంపేట, ఫిబ్రవరి 26: రామాయంపేట మండల పరిధిలోని అన్ని గిరిజన ప్రాంతాల్లో రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పేర్కొన్నారు. మండలంలోని దామరచెర్వు, కాట్రియాల, పర్వతాపూర్ తండాల్లో సోమవారం రూ. కోటి విలువైన సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండుమార్లు వరుసగా గెలిచిన గత ఎమ్మెల్యే ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ హామీలను నెరవేర్చటంలో వెనుకబాటు ఉండదన్నారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, జడ్పీటీసీ సంధ్య, రమేష్‌రెడ్డి, అల్లాడి వెంకట్, సీనియర్ నాయకులు చప్పెట ముత్యంరెడ్డి ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

నిజాంపేట, ఫిబ్రవరి 26 జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ నిజాంపేట జర్నలిస్టులు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం రామాయంపేట మండలం దామర్‌చెరువు గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు విచ్చేసిన మెదక్ ఎమ్మెల్యేను నిజాంపేట జర్నలిస్టులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వెంటనే ఇళ్ల స్థలాలను ఇప్పించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బస్టాండ్‌లో వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు



గుమ్మడిదల ప్రయాణ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 26: 'బస్టాండు పార్కింగ్‌కు... ప్రయాణికులు ఎండకు' అనే శీర్షికన ఈ నెల 24న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. ఈ మేరకు మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుధా గుమ్మడిదల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టారు. సోమవారం మెదక్ డిపో మేనేజర్ ఆదేశాల మేరకు నర్సాపూర్ డిపో ఇన్‌చార్జి లక్ష్మణ్, శంకర్, కంట్రోలర్ మధుసూదన్‌రెడ్డిలను గుమ్మడిదల ఆర్టీసీ బస్టాండ్‌కు పంపించి బస్టాండ్ ప్రాంగణంలో వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టారు. అదే మాదిరిగా ఆర్టీసీ బస్సులను ప్రయాణికులు ఉన్నచోట నిలిపి బస్సు ఎక్కే విధంగా ఆర్టీసీ సిబ్బంది మధుసూదన్ రెడ్డి చర్యలు తీసుకున్నారు. అనంతరం డిపో మేనేజర్ సుధా మాట్లాడుతూ గుమ్మడిదల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఆర్టీసీ బస్సులు ఆగి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్లడానికి జాతీయ రహదారిపై ఉన్న గ్రిల్ అడ్డుగా ఉండటం వల్ల వీలుకాదని తెలిపారు. పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, గ్రామ పెద్దలు బస్సులకు అడ్డుగా ఉన్న గ్రిల్‌ను తొలగించేలా చర్యలు తీసుకుంటే బస్టాండ్‌లో బస్సు ఆగే అవకాశం ఉంటుందనితెలిపారు. లేదా ప్రయాణికులకు ఎండ నుంచి ఇబ్బందులు కలుగకుండా జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్ల వద్ద ఆర్టీసీ బస్సులు ఆగి ప్రయాణికులను ఎక్కించుకునే విధంగా పరిశీలిస్తామని తెలిపారు. ప్రతిరోజూ గుమ్మడిదల బస్టాండ్ ప్రాంగణంలో వాహనాలు నిలుపకుండా సిబ్బందిని పెట్టి పర్యవేక్షిస్తామని తెలిపారు.

కేతకీలో ఎంపీ బీబీపాటిల్ పూజలు



కోహీర్: విశ్వేశ్వరాలయంలో ఎంపీ బీబీపాటిల్ పూజలు

ఝరాసంగం, ఫిబ్రవరి 26: దక్షిణకాశీగా ప్రసిద్ధిచెందిన శ్రీకేతకీ సంగమేశ్వరాలయంలో జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ సోమవారం కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. సినీనటుడు నవదీప్ కూడా ప్రత్యేక పూజలు చేశారు. వారు ఆలయ గర్భగుడిలో స్వామివారికి అభిషేకం చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు శాలువా, పూలమాలలతో వారిని ఘనంగా సన్మానించి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హన్మంతరావుపాటిల్, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోహీర్ విశ్వేశ్వరాలయంలో..

కోహీర్ ఫిబ్రవరి 26: మండల కేంద్రంలో ఇటీవల పునర్నిర్మాణం చేసిన శ్రీవిశ్వేశ్వరాలయంలో సోమవారం శ్రీ గణపతి, నాగదేవత, భద్రకాళి, వీరభద్రేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో హోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ పట్టణాభివృద్ధికి అన్ని విధాల సహకారం



హన్మంతాపూర్‌లో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి 26: నర్సాపూర్ పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు తనవంతు సహకారం ఉంటుందని ఎమ్మెల్యే సునితారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని హన్మంతాపూర్‌లో రూ. 15లక్షలతో నిర్మించిన మహిళాసమాఖ్య భవనాన్ని మున్సిపల్ ఛైర్మన్ డి.అశోక్‌గౌడ్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ అన్నివిధాల అభివృద్ధి చెందితేనే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. స్థానిక పాలకవర్గం కూడా అధికారులతో సమన్వయం చేసుకుని పట్టణంలోని అన్నిప్రాంతాలకు అభివృద్ధిలో సముచిత స్థానం కల్పిస్తు ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో ఛైర్మన్ అశోక్‌గౌడ్‌తో పాటు కమిషనర్ జైత్‌రాంనాయక్, వైస్‌ఛైర్మన్ నయీముద్దీన్, కౌన్సిలర్లు రాంచందర్, లక్ష్మీనగేష్, సరితఅంజనేయులుగౌడ్, నాయకులు బాల్‌రెడ్డి, భిక్షపతి, దావుద్, మేనేజర్ మధుసూదన్, మెప్మా పీడీ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు మంత్రి దామోదర ఆహ్వానం



గవర్నర్‌కు పెళ్లిపత్రికను అందజేస్తున్న మంత్రి

జోగిపేట, ఫిబ్రవరి 26: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి దామోదర రాజనరసింహ సోమవారం కలిశారు. రాజ్ భవన్‌లో ఆమెను కలిసిన దామోదర తమ కుమార్తె త్రిష పెళ్లి పత్రికను అందజేశారు.

ఘనంగా మల్లిఖార్జున స్వామి జాతర



ఆలయం వద్ద అగ్నిగుండాలు నిర్వహిస్తున్న దృశ్యం

కౌడిపల్లి, ఫిబ్రవరి 26: మండలంలోని కంచన్‌పల్లిలోని మల్లిఖార్జున స్వామి ఆలయం వద్ద సోమవారం కల్యాణోత్సవం అగ్నిగుండాలు, బోనాలు ఉరేగింపు, కోడెలను కట్టివేయడం ఘనంగా నిర్వహించారు. ఇ సందర్భంగా ఆలయంకు సదాశిపల్లి, పాంపల్లి, బురుగడ్డ, కొట్టాల, లింగంపల్లి, వెల్మకన్నె, అందుగులపల్లి, మానెపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున జాతర ఉత్సవాలలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి శివయ్య, గ్రామస్తులు సందిల్ల రాములు, సత్యంగౌడ్, దుంపల నర్సింలుతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామీణులకు ఉపాధిహామీ ఎంతో మేలు

నిజాంపేట, ఫిబ్రవరి 26: గ్రామీణులకు ఉపాధిహామీ పథకంతో ఎంతో మేలు జరుగుతుందని ఎంపీటీసీ లహరి రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గడిం చెరువులో సోమవారం ఉపాధి పనుల కింద చెరువు పూడిక తీత పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ తిరుమల్, సొసైటీ డైరెక్టర్, ఉపాధి కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో కస్తూర్బా విద్యార్థినుల ప్రతిభ

వెల్దుర్తి, ఫిబ్రవరి 26: ఈ నెల 25న నర్సాపూర్‌లోని శ్రీనివాస్ గార్డెన్స్‌లో కుంపు లెజెండ్ మాస్టర్ భూంరెడ్డి జ్ఞాపకార్థం 5వ నేషనల్ లెవల్ కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వెల్దుర్తి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల నుంచి 38మంది విద్యార్థినులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. 25 మంది విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచి బంగారుపతకాలు, 8మంది ద్వితీయ స్థానంలో వెండి పతకాలు, ఐదుగురు తృతీయ స్థానంలో నిలిచి బహుమతులను అందుకున్నారు.

దళిత కౌన్సిలర్‌ను బెదిరిస్తున్నారు

● ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

తూప్రాన్, ఫిబ్రవరి 26: తూప్రాన్ మున్సిపల్ 2వ వార్డు దళిత కౌన్సిలర్ మామిడి వెంకటేశ్, కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం కౌన్సిలర్ వెంకటేశ్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు కౌన్సిలర్ వెంకటేశ్ ఇంటికి నోటీసులు పంపిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. దళితులపై దాడులు జరిగే సహించబోమని, ఆ కుటుంబాన్ని ఎలాంటి ఇబ్బందులకు గురి చేసినా పోరాటం చేస్తామన్నారు.

కొల్చారం పెట్రోల్ పంపులో చెలరేగిన మంటలు



గాయపడిన పెట్రోల్ పంపు సిబ్బంది

మెదక్, ఫిబ్రవరి 26: మండలంలోని పోతంశెట్టిపల్లి చౌరస్తాలో గల హెచ్‌పీ పెట్రోల్ పంపులో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. పంపులో పని చేస్తున్న ఇద్దరు యువకులకు షార్ట్ సర్క్యూట్‌తో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనలో పెట్రోల్ పంపులో పని చేస్తున్న అంసాన్‌పల్లి గ్రామానికి చెందిన కడల కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పంపు యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే పెట్రోల్ పంపులో షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందని ఘటనాస్థలం వద్ద స్థానికులు ఆందోళన చేపట్టారు. ఎస్ఐ మహమ్మద్ గౌస్ క్షతగాత్రులను అంబులెన్స్‌లో మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

ఏఈవోలకు శిక్షణా శిబిరాలు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 26: నీటి యాజమాన్యం, సంరక్షణపై రెండు రోజుల పాటు ఏఈవోలకు శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు సంగారెడ్డి ఏవో ఏవీజీకే ప్రసాద్ తెలిపారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా రైతు వేదికలో సోమవారం శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో నీటికి తీవ్ర కొరత ఏర్పడే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయంలో నీటిని ఎలా పొదుపుగా వాడాలి, భూమిలో పడిన వర్షపు నీటిని ఏ విధంగా రక్షించుకోవాలనే విషయాలపై ఏఈవోలకు అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. శిబిరంలో జిల్లాలోని 70 మంది ఏఈవోలు హాజరయ్యారు.

హత్యాయత్నం కేసులో అన్నదమ్ములకు ఐదేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 26: హత్యాయత్నం కేసులో నేరం రుజువు కావడంతో అన్నదమ్ములకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి ఎం.రాధాకృష్ణ చౌహాన్ సోమవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే.. రామచంద్రపురం మండలం వెలిమెల గ్రామానికి చెందిన ఆశంగారి లక్ష్మయ్య 2017జూలై 2న తన ఇంటి పక్కన ఖాళీ స్థలంలో రేకుల షెడ్డు వేసుకుంటుండగా, ఆ స్థలం తమదంటూ అదే గ్రామానికి చెందిన ఆశంగారి రాజు(30), ఆశంగారి మహేష్(24) దుర్భాషలాడుతూ ఇనుపరాడ్‌తో దాడి చేశారు. దీంతో తీవ్ర గాయాల పాలైన ఆశంగారి లక్ష్మయ్య బీడీఎల్ భానూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు జరిపిన పోలీసులు పూర్తి వివరాలను కోర్టులో సమర్పించగా నేరం రుజువు కావడంతో నిందితులైన అన్నదమ్ములు రాజు, మహేష్‌లకు కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.వేయి జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో ఒక నెల సాధారణ జైలు శిక్ష విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి ఎం.రాధాకృష్ణ చౌహాన్ సోమవారం తీర్పు చెప్పారు.

వాహన తనిఖీల్లో ఇద్దరు దొంగల అరెస్ట్



నిందితులను చూపిస్తున్న పోలీసులు

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 26: చైన్ స్నాచింగ్, ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనం, మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడే ఇద్దరిని సంగారెడ్డి పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సోమవారం ఎస్పీ చెన్నూరి రూపేష్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ మేరకు.. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేటలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఇద్దరు అనుమానిత వ్యక్తులు పట్టుబడ్డారు. రామంతాపూర్‌కు చెందిన మున్నితం అమ్రాజ్ కుమార్ అలియాస్ అమర్‌రాజ్ కుమార్‌రెడ్డి, అలియాస్ డాల్(24), చంద్రాయన్‌గుట్టకు చెందిన తిప్పనబోయిన సాయికిరణ్ అలియాస్ సాయి(25) అమీన్‌పూర్‌లో పలుచోట్ల దొంగతనాలకు పాల్పడ్డారు. వారి నుంచి 10 తులాల బంగారం, 2.5కిలోల వెండి, రూ.25వేల నగదు, 20 అమెరికన్ డాలర్లు, 2 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తు విలువ మొత్తం దాదాపు 11.5లక్షలు ఉంటుందని తెలిపారు. కాగా జల్సాలకు అలవాటుపడిన నిందితులిద్దరిపై హైదరాబాద్ పరిసరాల్లో 40 దొంగతనం కేసులు ఉన్నాయని, వీరిద్దరు పలుమార్లు జైలు శిక్ష అనుభవించారని చెప్పారు.

అన్నారంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మృతి చెందిన వ్యక్తి

గుమ్మడిదల, ఫిబ్రవరి 26: మండలంలోని అన్నారం గ్రామ శివారులో ఓ గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. గుమ్మడిదల ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం అన్నారం గ్రామశివారులోని శ్మశానవాటికలో దాదాపు 55 ఏళ్లలోపు గల గుర్తుతెలియని వ్యక్తి పురుగుల మందు తాగి చనిపోయాడు. ఎవరైనా గుర్తుపట్టినట్లయితే ఫోన్ నెంబర్ 8712656751కు సంప్రదించాలని కోరారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 26: మండలంలోని భాగిర్తిపల్లి శివారు వాగులో నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పోలీసులు సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంత కాలంగా సూరారం, భాగిర్తిపల్లి శివారు వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారమందింది. దీంతో సోమవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని యజమాని చింతల సత్యనారాయణపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు

హత్నూర, ఫిబ్రవరి 26: నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్‌లు నిర్వహించి రైతులకు ఇబ్బందులు తలెత్తే విధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హత్నూర తహసీల్దార్ పర్వీన్ షేక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని గుండ్లమాచునూర్ సమీపంలో గల స్టోన్‌క్రషర్‌లను ఆమె పరిశీలించారు. స్టోన్ క్రషర్ వద్ద చేపట్టే బ్లాస్టింగ్‌లతో పరిసరాల్లోని వ్యవసాయ భూముల్లో పంటలు పండించే వీలు లేక బీడుగా మారుతున్నాయని రైతులు ఫిర్యాదు చేయడంతో, తహసీల్దార్ ఆ భూములను పరిశీలించారు. అదే విధంగా కాసాల గ్రామ శివారులో నక్షబాట ఆక్రమణకు గురి కావడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి సిమెంట్ పలకాలను ధ్వంసం చేయించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఈ పాస్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరపాలి

నిజాంపేట, ఫిబ్రవరి 26: గుర్తింపు పొందిన డీలర్లు అందరూ తప్పనిసరిగా ఎరువుల చట్ట ప్రకారం స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు సరిచేసుకోవాలని ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి ఏవో రాజ్‌నారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం ఆమర తనిఖీ చేసి, ఈపాస్ మిషన్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు కావలసిన ఎరువులు, మందులు అందుబాటులో ఉంచాలని, ఎరువులను ఈపాస్ మిషన్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరపాలన్నారు. ముఖ్యంగా పురుగుల మందు వ్యాపారం చేసే డీలర్లు అందరూ తప్పనిసరిగా ఓఎల్ఎంఎస్ విధానంలో ఆన్‌లైన్ చేసుకోవాలని, అలాగే స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారులకు అందించాలని డీలర్లకు సూచించారు.


అంగన్‌వాడీలకు బకాయి వేతనాలు చెల్లించండి



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 26 : అంగన్‌వాడీ కార్యకర్తలకు బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట సోమవారం సీఐటీయూ అధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగుల భర్తీని పాతపద్ధతిలోనే చేయాలని డిమాండ్ చేశారు. బకాయి వేతనాలు చెల్లించి, నెలనెలా సక్రమంగా వేతనాలు ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్ క్రాంతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు బాబురావు, రుణుక, స్వప్న, మౌనిక, సంతోష, లక్ష్మీ, మాదేవి, సుగుణ, సావిత్రి, సుమలత, అంగన్‌వాడీ హెల్పర్లు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడినవారికి తగిన ప్రాధాన్యం



మాట్లాడుతున్న మైనంపల్లి హనుమంతరావు

హవేళీఘణపూర్, ఫిబ్రవరి 26: పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలందరికీ తగిన ప్రాధాన్యం ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. సోమవారం మండలంలోని సర్దన గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. సమావేశంలో సర్పంచ్ సుభాష్, ఉపసర్పంచ్ రాంచందర్ రావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

చేగుంట, ఫిబ్రవరి 26: ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. చేగుంట మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలనలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో రెండు అమలు అయ్యాయని, ఈ నెల 27న మరో 2 గ్యారెంటీలను అమలు చేయబోతున్నట్టు తెలిపారు. అనంతరం చేగుంటలో మినీ స్టేడియం పనులను ఆయన పరిశీలించారు. సమావేశంలో చేగుంట ఎంపీపీ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వడ్ల నవీన్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.